# కాలమ్‌వాటని కథలు

## మల్లెపూలు

నాకు చిన్నతనంనుంచి పూలు కట్టడం ఒక హాబీ అది అందరికీ రాదు అని యీ విషయంలో కొంచెం గర్వంగా వుండేది. ఎందుకంటే మా అమ్మకు, మా అక్కకు చివరకు నా డియరెస్టు ఫ్రెండ్ రాణీకి కూడా రాదు. మా వూళ్ళో మల్లెపూలు చాలా చవక. అందువల్ల ప్రతిరోజు సాయంత్రం నాన్న ఆఫీసునుంచి వస్తూ తెచ్చేవారు. నేను శ్రద్ధగా అందంగా కట్టేదాన్ని. రాణీ వాళ్ళు ఎప్పుడన్నా తీసుకున్నా నన్ను పిలిచి (ప్రక్క ప్రక్క యిళ్ళుకాబట్టి) కట్టమనేది వాళ్ళ అమ్మ. నేను కడుతూవుంటే రాణి సిద్ధంగా పూలు చేతి కందిస్తూ కబుర్లు చెప్పేది.

మా పరీక్షలు దగ్గర పడుతున్నాయి. సీరియస్‌గా చదవాలి అనుకున్నాము. "రోజూ పూలు తెచ్చి ఆ పిల్లముందు పోస్తే.... ఓ గంట టైమ్ వేస్టు తేకండీ" అని సీరియస్‌గా వార్నింగ్ యిచ్చింది అమ్మ నాన్నగారికి. నాన్న కూడా ఎప్పుడన్నా తప్పించి తేవటం మానేశారు.

ఓరోజు రాత్రి అంటే ఎనిమిదిగంటలు అయివుంటుంది భోజనం చేసి భుక్తాయాసం తీర్చుకోను చాపమీద కూర్చుని, గోడకాను కొని కాళ్ళుజాపుకొని ఆలోచిస్తూ వున్నాను. అంతలో రాణీవాళ్ళ పనిపిల్ల "ఏంచేస్తున్నారమ్మా...." అంటూ పెద్దపొట్లం తెచ్చింది. "ఏమిటది.. ?" "పూలు-మల్లెపూలమ్మా.. అమ్మగారు సలీసుగా వున్నాయని పట్టుకొచ్చారట మిమ్మల్ని కట్టమని అమ్మగారు యిచ్చి రమ్మన్నారు....కట్టారామ్మా...." అడిగింది. "సరే పెట్టు...." అంటూ లోపలికి వెళ్ళి దారం తెచ్చుకొన్నాను. ఆ పిల్ల వెళ్ళిపోయింది. పొట్లం విప్పాను. చిత్రం.... ఒట్టి కాగితమే.... నీట్‌గా పొట్లంలా కట్టి వుంది. బాగా చూస్తే సన్నని అక్షరాలతో "ఏప్రిల్ ఫూల్ మేడమ్" అని వుంది. చెప్పొద్దూ... నాకు కోపం కన్న సంతోషం వేసింది.... పూలు లేకపోవటమేగాక, నన్ను ఏప్రిల్ ఫూల్ ఆనందంగా చేయటం.... అదీ మల్లెలతో ...ఫూల్ చేసినా యింత అందంగా చేస్తారని నా ఫ్రెండ్ దగ్గర మొదటిసారిగా తెలుసుకున్నాను.

—ఆర్. కుసుమ

## శ్రీశ్రీ కవితలు

అరసంలో, విరసంలో
మురిగినఅధివాస్తవికుల మొత్తం
కథలో
సరిలేని పేరు పొందిన
సిరులే-శ్రీశ్రీ కవితలు సిరిసిరి
మువ్వా!

ప్రాసక్రీడలు, లిమరు
క్కాసక్రీడలు, నయాగరాలై దూకే
ఊసులు, కవితా సతికే
నేసలు-శ్రీశ్రీ కవితలు సిరిసిరి
మువ్వా!

కమ్మరి కొలిమీ తమదై,
కుమ్మరిసారే తమదయి, కూలీనాలీ
కొమ్ములు కానే బాధల
చిమ్ములు-శ్రీశ్రీ కవితలు సిరిసిరి
మువ్వా!

దోలలు రసరాజ్యానికి,
ఊళలు కేదారగౌళ, లూలాలు
చాంపే
యాలా ఆనందాలకు
పీలలు శ్రీశ్రీ కవితలు సిరిసిరి
మువ్వా!

పరుగులు తీసే త్రాచులు,
ఉరకలు వేసేటి రేచు లుద్రేకాలై
కురిసెను నేలను నాలుగు
చెరగులు- శ్రీశ్రీ కవితలు సిరిసిరి
మువ్వా!

మ్రోగే కంచు నగారా,
లూగే ఉరి కొయ్యమీద
కుత్సాహంగా
సాగే వీరులు చూపే
చేగలు-శ్రీశ్రీ కవితలు సిరిసిరి
మువ్వా!

—ఉపాధ్యాయ

## సస్పెన్స్

'అర్జునరావ్'కి రచయితగా, ముఖ్యంగా సస్పెన్స్ రచయితగా చాలా పేరు వచ్చింది. అందుకోసం అతను కొన్ని వందల రచనలేమి చేయలేదు. అతను వ్రాసినది ఒక్కటే ఒక్క నవల. అయినా గాని అతనికి ఉన్నటువంటి అభిమానులు మరే రచయితకీ లేరంటే అతిశయోక్తి కాదు. ఆ నవల సీరియల్‌గా వచ్చి అందరినీ 'థ్రిల్'లో ముంచటమే కాకుండా నవలగా వెలువడిన మొదటి సంవత్సరంలోనే లక్ష కాపీలు అమ్మి రికార్డు సృష్టించింది. ఆ నవలను సినిమాగా తీయడానికి పది మంది పేరు పొందిన నిర్మాతలు అతని చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నారు.

మిగిలిన రచయితలలాగా స్వంత డబ్బుతో కాకుండా అభిమానుల ఆదరాభిమానాలతోనే అతనికి అభినందనసభ ఏర్పాటు చేయబడింది. ఆ సభకు మహామహులంతా హాజరు అయ్యారు. ఒక సుప్రసిద్ధ హీరో మాట్లాడుతూ—"అసలు ఆ నవల గొప్పతనమంతా ఆయన మలచిన ఆ సస్పెన్స్‌లోనే వున్నది. ఆ ఆలోచన వచ్చినందుకే ఆయనను అభినందించాలి" అని అన్నారు.

అప్పుడు వచ్చింది మిసెస్ అర్జునరావుకు ఒక పెద్ద అనుమానం. అక్కడే తన సంశయం తీర్చుకుందామనుకుని, మళ్ళీ మనసు మార్చుకున్నది.

ఆ రాత్రి యింటివద్ద మిసెస్ అర్జునరావ్ తన శ్రీవారితో "నాకో చిన్న అనుమానం. నేనేగదా నవలనంతా ఫెయిర్ చేసింది. అయినాగాని నాకు కలగని ఆ సస్పెన్స్ యింతమందికి కలగటం ఆశ్చర్యంగా వున్నది" అన్నది అతని గుండీలు సరిచేస్తూ.

ఒక చిన్న చిరునవ్వు నవ్వాడు అర్జునరావ్. తర్వాత నెమ్మదిగా, "సీరియల్‌ని పంపించేటప్పుడు పొరపాటున ఒక చాప్టర్ మిస్సయింది" అంటూ అసలు 'ముడి' విప్పాడు.

గమనిక: పొరపాటువలన కూడా సస్పెన్స్ విజృంభిస్తుంది. కనుక పాఠకులూ జాగ్రత్త!

—ఎస్.పి.